క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



పూజలందుకుంటున్న లక్ష్మీ నృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖీ నది ఒడ్డున వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ప్రత్యేక అలంకరణలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: సీతానగరం మండలం కాసాయిపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు లచ్చుపతుల శ్రీనివాసరావు, బొమ్మాళి బన్నీ, తదితరులు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తెలు శ్రీనివాసరావు, మడక ప్రభాకరరావు, బంకూరు ధనుంజయ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



సామలను సన్మానిస్తున్న పెద్దలు

బలిజిపేట: ఎంఈఓ -1 సామల సింహాచలంను పెదపెంకి నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు, బలిజిపేట సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వి.సుబ్బారావు గురువారం సన్మానించారు. ఎంఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యారంగంలో మండలాన్ని ముందుకు నడిపిస్తున్న నేపథ్యంలో సామలను సన్మానించినట్లు సంజీవనాయుడు, సుబ్బారావు తెలిపారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


వైభవంగా సామూహిక వివాహాలు



బట్టివలసలో సామూహిక వివాహాలు

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ బట్టివలస గ్రామం ఆంజనేయ స్వామి ఆలయంలో గిరిజన దంపతులకు గురువారం సామూహిక వివాహాలను జరిపించారు. పలు గ్రామాలకు చెందిన 9మంది గిరిజన దంపతులకు శ్రీ విద్యా గాయత్రి ఉపాసకులు శంభాన హేమ సుందరాచార్య ఆధ్వర్యంలో సామూహిక వివాహాలను ఘనంగా నిర్వహించారు. గిరిజన కుటుంబాలలో పెళ్లి చేసుకునే ఆర్థిక స్తోమత లేక సామూహిక వివాహాలు జరిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. సామూహిక వివాహ కార్యక్రమానికి రైతు వేమూరు కోటేశ్వరరావుతో పాటు, గ్రామస్తులు సహకారం అందించారు.

నీలాటి రేవుకి రోడ్డు సౌకర్యం



మామిడిపల్లిలో పూర్తయిన సీసీ రోడ్డు

సాలూరు రూరల్: మామిడిపల్లి ప్రజలు కొన్నాళ్లుగా ఎదురుచూస్తున్న నీలాటి రేవు రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆదేశాల మేరకు మండల పరిషత్ అధికారులు ఈ రహదారి పూర్తి చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు గుర్తించి రోడ్డు సౌకర్యం కల్పించినందుకు గ్రామస్తులు డిప్యూటీ సీఎం రాజన్నదొర, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిపాలనా సౌలభ్యానికే పట్టం

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: పరిపాలనా సౌలభ్యం.. ప్రజా సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని పెద్దింపేటలో రూ.23.94 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే భవనంతో పాటు జగనన్న కాలనీలో పలు నూతన గృహాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సంక్షేమాన్ని అందుబాటులోకి తీసుకురావడమే సీఎం జగనన్న ముఖ్య ఉద్దేశమన్నారు. గత పాలకులు ప్రజలను మోసం చేస్తే.. ఎన్నికల ముందు పాదయాత్రలో నేను ఉన్నాను-నేను విన్నాను అని ప్రజలకు భరోసా ఇచ్చిన నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని అమలు చేసిన ముఖ్యమంత్రి ఒక్క జగన్ మోహన్‌రెడ్డేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లని తెలిపారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెలెనెస్ సెంటర్లతో గ్రామాలలో అన్నిరకాల సేవలు అందుబాటులో లభిస్తున్నాయన్నారు.

నూతన గృహాలు ప్రారంభం..



ఆర్‌బీకే భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, తదితరులు

పేదలందరికి ఇళ్ల కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించుకున్న జగనన్న ఇళ్లను ఎమ్మెల్యే జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎం.సాంబమూర్తి, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఏఓ శ్రావణ్, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల శాఖ మహిళా సంఘ అధ్యక్షురాలు ఎం.దుర్గేశ్వరి, సర్పంచ్‌లు కె.మోహనరావు, సుందరరావు, విజయ, ఆర్.శ్రీనివాసరావు, ఎన్.పాపారావు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడు గంగయ్య, నాయకులు పి.రామకృష్ణ, బి.సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు ఆడడంలో 'బోనెల' ఘనాపాటి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- టీడీపీ ఇన్‌చార్జ్ బోనెల విజయచంద్రపై ఎమ్మెల్యే జోగారావు ఆగ్రహం

పార్వతీపురం టౌన్: తనపై ఆరోపణలు చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోనెల విజయచంద్ర అబద్ధాలు ఆడడంలో ఘనాపాటి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రజలను హింసించే వాడు లోకేష్ అయితే పార్వతీపురంలోఉన్న టీడీపీ ఇన్‌చార్జ్ జోగారావు పులకేశి అని ఎద్దేవా చేశారు. సొంత ఊరి సేవకు వచ్చానని చెప్పిన బోనెలకు ఉన్న ఊరిలోనే 2019 ఎన్నికల్లో ఓటు ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పుడు మూడు నెలల ముందు వెంకంపేట బూత్‌లో ఓటు ఎందుకు నమోదు చేసుకున్నావన్నారు. మీ టీడీపీ నాయకులు చేసిన భూ దందాలు, చేసిన అక్రమ కట్టడాలను కూల్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మీ నాయకుడు బార్నాల సీతారాం ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని నేను చూపిస్తాను.. అందులో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు నీవు సిద్ధమా అని బోనెలకు సవాల్ విసిరారు.

ఒక దళిత ఎమ్మెల్యేపై అసత్య ప్రచారమా..

ఒక దళిత ఎమ్మెల్యేపై విమర్శ చేసేముందు పూర్వాపరాలు, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని జోగారావు హితవుపలికారు. నోరు ఉందికదా అని నచ్చినట్లు అబద్ధాలు ఆడితే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017లో బొబ్బిలి రాజులు భూములను ఆక్రమించుకోవాలని చూస్తే అడ్డుకుని పోరాటం చేసిన ఘతన తనదన్నారు. 2014 - 19 సంవత్సరాల్లో అధికారంలోఉన్న మీరు డంపింగ్‌యార్డు సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు. డంపింగ్‌యార్డును వేరేచోటుకు తరలిస్తే దాన్ని అడ్డుకున్నది మీరుకాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాంతానికి ఏం చేశానో. ఎంత అభివృద్ధి జరిగిందో ఇక్కడి ప్రజలకు తెలుసునని చెప్పారు.

ఐఎఫ్‌ఎం సభ్యులను మోసం చేసింది నువ్వు కాదా..

ఇంటలెక్చువల్ ఫాం ఫర్ మాదిగాస్ (ఐఎఫ్‌ఎం) అనే సంస్థ మాదిగ జాతికోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అటువంటి సంస్థలో ఉన్న కొంత మంది మేధావులను నువ్వు పక్కదారి పట్టించలేదా అని జోగారావు ప్రశ్నించారు. ఆ సంస్థ పేరుమీద కార్యవర్గ సభ్యులెవరూ లేకుండా వైజాగ్ గీతం యూనివర్సిటీలో గల కెనరాబ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేసి ఆర్థిక మోసాలకు పాల్పడినది వాస్తవం కాదా అని మండిపడ్డారు. ఎదుట వ్యక్తిపై ఆరోపణలు చేసేముందు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల దోపిడీ

రాయగడ: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జిమిడిపేట సమీపంలో దంపతులను అడ్డగించి వారి నుంచి బంగారు ఆభరణాలు దోపిడీ చేసిన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితుడు శిఖాల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం - మన్యం జిల్లాలోని కొమరాడ ప్రాంతానికి చెందిన మణి భూషణరావు అతని భార్యతో కలిసి పనిమీద రాయగడ బైక్‌పై వచ్చారు. పనులు ముగించుకున్న అనంతరం తిరిగి బధవారం సాయంత్రం తమ స్వగ్రామం కొమరాడ వెళ్తున్న సమయంలో ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జిమిడిపేట సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిని అడ్డగించారు. భార్యాభర్తలను కత్తితో భయపెట్టి మణిభూషణరావు భార్య మెడలోని మంగళసూత్రం, ఇతర బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

పార్వతీపురం టౌన్: గిరిశిఖర రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల దగ్గర పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా కలిగి ఉన్న గిరిశిఖర రైతులకు ఇప్పటివరకు పీఎం కిసాన్ వైఎస్సార్‌ఆర్‌బీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి ప్రతి ఏటా రూ.13,500 జమ చేస్తుందన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఓఎఫ్‌ఆర్ రైతులకు పీఎం కిసాన్ ద్వారా రూ. 6 వేలు రైతుల ఖాతాల్లో జమచేయనుందన్నారు.

20న వాహనాల వేలం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 20వ తేదీన ఆరు ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహించనున్నట్లు సీఐ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 11 గంటలకు జరగనున్న వేలంలో పాల్గొనాలని కోరారు. అలాగే రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు వాహనాలకు అదే రోజున వేలం వేయనున్నట్లు రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు. ఏఎస్పీ సంజయ్ సురోన్, సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కళావతిపై ఆరోపణలు తగవు

వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని రాజకీయంగా ఎదుర్కోలేక టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వండవ మాజీ సర్పంచ్ విశ్వాసరాయి విజయకుమారి అన్నారు. గురువారం ఆమె వండవలో విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే కళావతి తాత, తండ్రి తమ సొంత భూమి వందల ఎకరాలను పేదలకు ధారాదత్తం చేశారని అన్నారు. వాస్తవ విషయాలను మరిచి టీడీపీ నేత నిమ్మక జయకృష్ణ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.

హర్షం

గుమ్మలక్ష్మీపురం: తెలుగు జాతి ముద్దు బిడ్డ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు (పీవీ), ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్‌లను దేశ అత్యున్నత పౌర పురస్కారానికి ఎంపిక చేస్తూ, వీరి అపారమైన సేవలకు పట్టం కడుతూ 'భారత రత్న' ప్రకటించడం పట్ల గుమ్మలక్ష్మీపురం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నవభారత ఆర్థిక రూప శిల్పి, ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రగతిపథంలో పరుగులు పెట్టించిన అపర మేధావి పీవీ అని... ప్రజలు పస్తులుండే దుస్థితి పోవాలని, అధిక దిగుబడులిచ్చే కొత్త వంగడాలను సృష్టిస్తూ, ఇసుక నేలల్లోనూ సైతం పసిడిరాశులు పండించొచ్చని నిరూపించిన గొప్ప వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ అంటూ చిన్నారావు కొనియాడారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీరఘట్టం: వీరఘట్టం, పాలకొండ మండలాల పరిధిలో ఉన్న నవగాం, వీరఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్లలో శుక్రవారం మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్టు ట్రాన్స్‌కో ఎ.డి. టి.గోపాలకృష్ణ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణం దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

సమష్టిగా అభివృద్ధి ప్రణాళికలు

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా ప్రణాళికలు చేయాలని డీఎల్‌పీఓ ఎం.నాగభూషణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గుర్తించిన అభివృద్ధి పనుల ప్రణాళికలను ఇ-గ్రామ స్వరాజ్ (పీఎఫ్‌ఎంఎస్)లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామానికి కావల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, డీఆర్‌పీటీఓటీ ఎ.గణపతిరావుతో పాటు వివిధ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీఎల్‌పీఓ నాగభూషణరావు

'భోజనం' బాగుండాలి

కురుపాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని ఎంఈఓ ఎస్.సత్యనారాయణ ఆదర్శ పాఠశాల సిబ్బందికి, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భోజనం బాగోటం లేదని తమ తల్లిదండ్రులకు తెలియజేయగా తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ సత్యనారాయణ, ఎంఈఓ -2 రాధాకృష్ణ ఆదర్శ పాఠశాలకు వెళ్లి ఆదర్శ పాఠశాల సిబ్బంది, భోజన నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు ప్రతీరోజు సరఫరా చేస్తున్న ఆహారం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, నాణ్యత లేకుంటే అటువంటి ఆహారాన్ని పక్కన పెట్టాలని మెనూ ప్రకారం సరఫరా చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బియ్యం, నిత్యావసర సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. పదిహేను రోజుల పాటు భోజన నిర్వహణ పరిశీలన బాధ్యతను సీఆర్‌పీలకు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ టీం వేసి ఇకపై భోజన నిర్వహణను పరిశీలించే చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదర్శ పాఠశాలలో స్టాక్ వివరాలను ప్రిన్సిపాల్ రామలక్ష్మిని అడిగి తెలుసుకుంటున్న ఎంఈఓ

ఐటీడీఏలో రెండో రోజు సామూహిక దీక్షలు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ముఖద్వారం వద్ద సీహెచ్‌డబ్ల్యూలు రెండో రోజు గురువారం సామూహిక నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.కాంతారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పని చేసే 2361 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చు చేయాలన్నారు. వేతనం పెంచాలని, యూనిఫాం, రికార్డులు, మెడికల్ కిట్లు టీఏ, డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి, సోములమ్మ, శిరీష పాల్గొన్నారు.



సామూహిక దీక్షలు చేస్తున్న సీహెచ్‌డబ్ల్యూలు

విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలి

- డీఎంఓ జగన్ మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి (డీఎంఓ) టి. జగన్ మోహన్‌రావు అన్నారు. కొత్త బెలగాం -1 పరిధిలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల ఆరోగ్య వివరాలు, సిక్ రిజిష్టర్, సిక్ రూమ్ నిర్వహణ, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను సిక్ రిజిస్టర్‌లో పక్కాగా నమోదు చేయాలని సూచించారు. హాస్టల్, కిచెన్‌లలో వాడుక నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. రక్తహీనత, పరిశుభ్రత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు మోహనరాయుడు, ఏబీవీబీ పట్నాయక్ , వైద్య సిబ్బంది నారాయణమ్మ, హాస్టల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డీఎంఓ టి. జగన్ మోహన్‌రావు

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- డీఎంఓ జగన్ మోహన్‌రావు

సీతానగరం: హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఓ టి. జగన్ మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఆయా కేంద్రాల్లో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు 105 రకాల మందులు సిద్ధంగా ఉంటాయని చెప్పారు. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పావని, ఏఎంఓ సూర్యనారాయణ, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, సూపర్‌వైజర్ భవాని, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎంఓ టి. జగన్‌మోహన్‌రావు

ధ్రువపత్రాలు తప్పనిసరి

- జిల్లా రవాణాశాఖాధికారి మల్లికార్జున రెడ్డి

పార్వతీపురం టౌన్: భారీ వాహనాలకు ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా రవాణాశాఖాధికారి సి. మల్లికార్జున రెడ్డి అన్నారు. రహదారి భద్రత మసోత్సవాలల్లో భాగంగా వాహన డ్రైవర్లు, వాహన అసోసియేషన్ సభ్యులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఇన్సూరెన్స్ చేయడం వల్ల వాహన యజమాని, డ్రైవర్, వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ ఎం.శశికుమార్, ఏఎంవీఐ ఎస్.రమేష్‌కుమారి, ఏఎస్‌వీఐ జి. సీతారాం, మెడికల్ ఆఫీసర్ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖాధికారి మల్లికార్జున రెడ్డి

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి

పాలకొండ రూరల్: నగర పంచాయతీలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపించాలని ప్రజలు, పలు రాజకీయ పార్టీల నాయకులు నినదించారు. గురువారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. నగర పంచాయతీ కార్యాలయానికి చేరిన ఈ ర్యాలీ ద్వారా కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. 20వ వార్డులో ప్రస్తుతం నిర్వహిస్తున్న తాత్కాలిక డంపింగ్ యార్డు కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులపై వైఎస్సార్ సీపీ నాయకులు కోరాడ సూర్యనారాయణ అధికారులు వివరించారు. దాదాపు నాలుగేళ్లగా మూడు వార్డుల ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ చొరవతో మండలంలోని అట్టలి సమీపంలో శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న డంపింగ్ యార్డు పనులు పూర్తికి కృషి చేయాలని, పట్టణం నుంచి ఈ సమస్యకు స్వస్తి పలకాలని 20, 1వ వార్డుల కౌన్సిలర్లు గంటా సంతోష్‌కుమార్, పల్లా రాంబాబు కోరారు. సీఐటీయూ నాయకులు దావాల రమణారావు, బీజేపీ నాయకులు కారెపు చిట్టబాబు, జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు తదితరులు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, పలు రాజకీయ పార్టీల నాయకులు

మోదీ ప్రభుత్వ విధానాలపై నేడు సమ్మె

గుమ్మలక్ష్మీపురం: మోదీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం తలపెట్టిన పారిశ్రామిక సమ్మె - గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరంగి గోపినాయుడు, సీపీఎం గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల కార్యదర్శులు పువ్వల ప్రసాద్, మండంగి సింగన్న తదితరులు కోరారు. బంద్‌కు మద్దతునివ్వాలంటూ గురువారం గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లోని వ్యాపారులు, దుకాణదారులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందని, రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠ పర్చాలని, భూ హక్కుల చట్టం 22ను, అటవీ హక్కుల చట్టం సవరణను ఉపసంహరించాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలని తదితర డిమాండ్లతో నిర్వహించే సమ్మెకు ప్రజలంతా మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వ్యాపారులకు కరపత్రాలు అందజేస్తున్న సీపీఐ నాయకులు

పి.ఆమిటిలో పాఠశాలను పునఃప్రారంభించాలి

గుమ్మలక్ష్మీపురం: ద్రవ్య సహాయక పాఠశాలను పునఃప్రారంభించేలా విద్యాశాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని మండలంలోని పి.ఆమిటి గ్రామస్తులు డిమాండ్ చేశారు. సర్పంచ్ తాడంగి దమయంతి ఆధ్వర్యంలో మూతపడిన పాఠశాలను పునఃప్రారంభించాలని కోరుతూ గ్రామస్తులు మూతపడిన పాఠశాల ముందు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో స్థాపించబడిన ద్రవ్య సహాయక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు 2021లో అనారోగ్యంతో మృతి చెందిందని తెలిపారు. ఆ సమయంలో యాజమాన్యం సకాలంలో స్పందించకపోవడంతో ఉపాధ్యాయుల నియామకం జరగలేదని.. ఫలితంగా తమ గ్రామానికి చెందిన 21 మంది విద్యార్థులు సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపాలపురం, మొరమ గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను ప్రభుత్వంలో విలీనం చేయాలని యాజమాన్యం కూడా ప్రభుత్వానికి అంగీకార పత్రం అందజేసినప్పటికీ..అనివార్య కారణాల వలన ప్రభుత్వంలో విలీనం కాలేదన్నారు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూతపడ్డ తమ గ్రామంలోని పాఠశాలకు ఉపాధ్యాయులను నియమిస్తూ.. పునఃప్రారంభించి గ్రామంలోని విద్యార్థులకు గ్రామంలోనే విద్యను అందించే ఏర్పాట్లను చేపట్టాలని గ్రామస్తులు కోరారు.



నిరసన తెలుపుతున్న పి.ఆమిటి గ్రామానికి చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు